మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ఆయోధ్య రామయ్య అక్షింతల వితరణ



కలెక్టర్ రాజర్షిషాకు అయోధ్య రామయ్య అక్షింతలను అందజేస్తున్న దృశ్యం

**మెదక్ అర్బన్, జనవరి12 ప్రభాతవార్త:** శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నుంచి అయోధ్య అక్షింతలను మెదక్ జిల్లా సమీకృత పరిపాలన కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌లకు, జిల్లా అధికారులకు శుక్రవారం వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహ సంయోజక్ బండి వెంకటేశ్వర్లు, నగర సంయోజక్, ఆరెళ్ల అరవింద్, నగర సహ సంయోజక్ సుంకరి కృష్ణ, ఆకుల రాజశేఖర్, మడపతి సంగమేశ్వవర్, మాందపురం సతీష్ పాల్గొన్నారు

## 14న గోదా కళ్యాణం

**కోహెడ, జనవరి 12, ప్రభాతవార్త:** కోహెడ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 14న గోదా కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అలయ అర్చకులు బ్రహ్మశ్రీ డా॥ కోహెడ ప్రసాద్‌రావ శర్మ శుక్రవారం తెలిపారు. స్వామి వారి అలయంలో గత నెల రోజుల నుంచి నిత్యం తిరుప్పావై పాశుర పఠనం, ప్రత్యేక పూజాధికార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుప్పావై 30 పాశురములు పూర్తి కావడంతో భోగి పండుగ పర్వదినం గోదా రంగనాయకుల కళ్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. గోదా కళ్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కళ్యాణమహోత్సవాన్ని తిలకించిన వారికి కోరిన కోరికలు తీరడంతో పాటు పెళ్లి కానీ అమ్మాయిలకు చక్కని వరుడు, అబ్బాయిలకు చక్కని వధువు లభిస్తుందని, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని ఇక్కడి భక్తుల ప్రగాఢ విశ్వాసంగా ఉందన్నారు. ఎంతో మహిమాన్వితమైన ఈ కళ్యాణోత్సంలో పాల్గొని భక్తులు కృతార్థులు కావాలని అయన కోరారు.

# స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

### -జిల్లా కలెక్టర్ రాజర్షిషా



స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, జనవరి12 ప్రభాతవార్త:** స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ లక్ష్యం వైపు ఉన్న శ్రద్ధ, ఆసక్తి లక్ష్య సాధన వైపు కూడా చూపించాలని, అదే విజయ రహస్యం అన్న వివేకానందుని మాటలు గుర్తు చేశారు. స్వామి వివేకానంద గురువుగారి కోరిక మేరకు అమెరికాకు వెళ్లి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేశాడని, అతని వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టిందని, అందుకే ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని యువతను ఉద్దేశించి అన్నారు. అనంతరం నిరుద్యోగులైన యువతి యువకుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా బ్యూటిషన్, టైలరింగ్, సీసీ టీవీ రిపేర్, మొబైల్ సర్వీసింగ్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అందరికీ ఉద్యోగ అవకాశాలు రావడం చాలా కష్టమని, స్వయం ఉపాధి ద్వారా ఎంతో అభివృద్ధి చెందవచ్చన్నారు. అనంతరం శిక్షణ పొంది పరీక్ష రాసి ఉత్తీర్ణులైన 142 మంది యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌వో పద్మశ్రీ, జిల్లా అధికారి జయరాజ్, జిల్లా యువజన, క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవవరణ పకడ్బందీగా జరగాలి

### -కలెక్టర్ వల్లూరి క్రాంతి



రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 12, ప్రభాతవార్త:** ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. శుక్రవారం సంగారెడ్డిలోని కలెక్టరేలోని మిని సమావేశ మందిరంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో భాగంగా ఈ నెల 6న ఓటర్ డ్రాఫ్ట్ జాబితా ప్రచురితమైంది, క్లేమ్స్, అభ్యంతరాలకు ఈ నెల 22వ తారీఖు వరకు అవకాశం ఉందన్నారు. డూప్లికేట్, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. అధికారులు, పార్టీల నాయకులు సమన్వయంతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సజావుగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు బూత్ స్థాయిలో ఏజంట్లను నియమించుకోవాలని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలుపపండం జరిగిందన్నారు. 2 కిటో మీటర్ల పరిధి దాటిన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిని మార్చాలని రాజకీయ పార్టీల నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నెల 21, 22వ తారీఖులలో ప్రతి పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందని, కేంద్రాలలో బిఎల్ఓలు అందుబాటులో ఉండాలని సూచించారు. కొత్త ఓటరు నమోదును అర్హులందరూ చేసుకోవాలని, ఓటుజాబితాలో మార్పులు, చేర్పులు సైతం చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు.

## దొంగతనాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### -చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాం : సీపీ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సంక్రాంతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు వెళ్లే అయా గ్రామాల, కాలనీల, అపార్టుమెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ డా॥అనురాధ సూచించారు. శుక్రవారం అమె మాట్లాడుతూ చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. పోలీసుల సలహాలు, సూచనలు విధిగా పాటించి దొంగతనాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాలకు వెళ్లే సమయంలో విలువైన బంగారు, వెండి అభరణాలు, డబ్బులు బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని..లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశ:లో దాచుకోవాలన్నారు బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదన్నారు. తాళం వేసి గ్రామాలకు వెళ్లాల్సి వస్తే విధిగా స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని వారి వివరాలు నమోదు చేసుకొని ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డు, సర్వెంట్‌గా నియమించుకోవాలన్నారు. ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామంలో, పట్టణంలో, కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూం 8712667100 కాల్ చేయాలన్నారు.

## నేడు సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీష్‌రావు పర్యటన

**సిద్దిపేట రూరల్, జనవరి 12, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఈనెల 13న సిద్దిపేటలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కోమటిచెరవు నెక్లెస్ రోడ్డుపై కైట్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 10.30కి సిద్దిపేట స్టేడియంలో అటో క్రెడిట్ కో-అపరేట్ సొసైటీ అధ్వర్యంలో అటో డ్రైవర్స్‌కు అటల పోటీలు ప్రారంభిస్తారు. 11 గంటలకు ముర్షద్ గడ్డ ఉర్సు ఉత్సవాలలో పాలొ ంటారు. సాయంత్రం 4.30కి ఇందూర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో తెలంగాణ టార్గెట్ బాల్ అసోసి యేషన్(యూత్ నేషనల్ టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 5.30కి వెంకటేశ్వర దేవాలయం వద్ద అయోధ్య రామ మందిరంకు భోజన సామాగ్రి వాహనాలను ప్రారంభిస్తారు.

## రెవెన్యూ అధికారుల వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలి

**మిరుదొడ్డి, జనవరి 12, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం రద్దు చేసిన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను తిరిగి పున:రుద్ధరించాలని దళిత బహుజన ఫ్రంట్ సిఎం ప్రజావాణిలో విన్నవించింది. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ అవినీతి పేరుతో విఅర్ఓ వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం భూ పరిపాలనను విధ్వంసం చేసి పేదలకు భూ హక్కులను నిరాకరించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో భూ వివాదాల, భూ హక్కుల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడ్డ విఅర్ఓ వ్యవస్థను పటిష్ట పరిచి పేదల భూ హక్కుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మ్యానువల్, డిజిటల్ భూ రికార్డులను గ్రామాలలో అందుబాటులో ఉంచాలన్నారు. గత ప్రభుత్వం తొలగించిన పహిణిలోని అనుభవదారు కాలన్ని తిరిగి చేర్చాలన్నారు. సమగ్ర భూ సర్వే చేయకుండా భూ ప్రక్షాళన చేసి ధరణి పేరుతో గత ప్రభుత్వం భూస్వాములకు అనుకూలమైన విధానాలను అమలు చేసిందన్నారు. వారసత్వంగా వచ్చే భూమి హక్కుల పేరు మార్పుకు గత ప్రభుత్వం పెట్టిన మ్యూటేషన్ ఫీజులను రద్దు చేసి ఉచితంగా మ్యూటేషన్ చేయాలన్నారు. భూపరిపాలన ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ధరణి అధ్యాయనం కోసం కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కమిటీ ప్రజా, దళిత సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

### -అక్కడికక్కడే వ్యక్తి మృతి

**కొల్చారం, జనవరి12 ప్రభాతవార్త** ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామ శివారులో మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ డిపోకు చెదిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మెదక్ నుండి పటాన్‌చెరు వెళ్తున్న క్రమంలో, సిద్ధిపేట జిల్లా మిర్‌దొడ్డి మండల కేంద్రానికి చెందిన పిట్ల యాదగిరి జోగిపేట నుండి మెదక్ వైపు తన స్వంత ద్విచక్రవాహనంపై మిర్‌దొడ్డికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో పిట్ల యాదగిరి (32) అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి ఎస్ఐ మహమ్మద్‌గౌస్ చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేమాన్ని పోస్టు మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంఘటన స్థలంలో బైక్‌ను ఢీకొన్న బస్సు

# 31న సీఎంఆర్ పూర్తి చేయడానికి నిర్ణీత గడువు

### -మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తాం

### -రైస్‌మిల్లర్లకు తేల్చి చెప్పిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, జనవరి12 ప్రభాతవార్త:** జిల్లాలో అధిక శాతం సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల యాజమాన్యంతో శుక్రవారం ఐడీవోసీలోని వీడియో సమావేశ మందిరంలో అత్యవసర సమావేశం జిల్లా కలెక్టర్ రాజర్షిషా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల 31 వరకు అవకాశం ఇచ్చిందని, అప్పటి లోగా బియ్యం పెట్టని మిల్లుల యజమానులపై ఆర్ఆర్ యాక్ట్ క్రింద స్థిర చర ఆస్తుల జప్తు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. 13 నెలలు గడుస్తున్నా మిల్లర్లు అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. సీఎంఆర్ కేటాయింపులపై కూలంకషంగా చర్చించారు. రైతుల నుండి ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరుపుతూ ఈ నెలాఖరులోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకే చేరవేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి రైస్‌మిల్లులో పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ మల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తూ నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని కరాఖండీగా తేల్చిచెప్పారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఎంత మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో సీఎంఆర్ కేటాయింపుల పట్ల నిర్లక్ష్యాన్ని తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోపు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చిచెప్పారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని రైస్‌మిల్లుల్ల తప్పనిసరిగా పూర్తిస్థాయి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరుపుతూ ఈ నెలాఖరు లోపు ఎఫ్‌సీఐకి నిల్వలు చేరవేయాలని గడువు విధించారు. అవసరమైతే ప్రైవేట్ ధాన్యం మిల్లింగ్‌కు విరామం ఇచ్చి సీఎంఆర్ లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించాలని, సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో బాయిల్డ్ రైస్ నిల్వలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు నెలకొని ఉంటే జిల్లా యంత్రాంగం తరపున తప్పనిసరిగా వాటిని పరిష్కరిస్తామన్నారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెనువెంటనే దిగుమతి చేసుకునేలా గోడౌన్ల వద్ద కూలీల సంఖ్య పెంచాలని, మిల్లర్లకు కోరిన వెంటనే గోడౌన్లలో బియ్యం దిగుమతి కోసం ఎక్కడ స్థలం అందుబాటులో ఉంటే అక్కడికి మిల్లర్లను అనుమతించాలని ఎఫ్‌సీఐ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీపీఎస్‌వో బ్రహ్మారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో హోరాహోరీగా కబడ్డీ పోటీలు

**గజ్వేల్, జనవరి 12 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలో జరుగుతున్న 49వ జూనియర్ ఇంటర్ జిల్లా కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు రెండవ రోజుకు చేరుకున్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు గజ్వేల్ వేదికగా జరుగుతుండడంతో పోటీలను చూడడానికి పట్టణ వాసులు, యువత పెద్దఎత్తున తరలివచ్చారు. 33 జిల్లాల నుండి వచ్చిన మహిళ, పురుషుల జట్లు హోరాహోరీగా పోటీపడుతున్నారు. శుక్రవారం ఉదయం జరిగిన పోటీల్లో మహిళల జట్లలో మహబూబాబాద్, నారాయణపేట్ తలపడగా మహబూబాబాద్ విజయం సాధించింది. మేడ్చల్, భూపాలపల్లి తలపడగా మేడ్చల్ విజయం సాధించింది. కొత్తగూడెం, హైద్రాబాద్-1 తలపడగా కొత్తగూడెం విజయం సాధించింది. ములుగు, మంచిర్యాల తలపడగా ములుగు గెలిచింది. గద్వాల్ జోగులాంబ, మెదక్ జట్లు పోటీ పడగా గద్వాల్ గెలిచింది. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ పోటీ పడగా మహబూబ్‌నగర్ గెలిచింది. సిద్దిపేట, యాదాద్రి భువనగిరి తలపడగా సిద్దిపేట గెలిచింది. సూర్యపేట, హైద్రాబాద్-1 పోటీ పడగా సూర్యపేట విజయం సాధించింది. కరీంనగర్, మంచిర్యాల పోటీ పడగా కరీంనగర్ గెలిచింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో హైనరదాబాద్, మెదక్ పోటీ పడగా హైద్రాబాద్ గెలిచింది. హన్మకొండ, ఆసిఫాబాద్ పోటీ పడగా హన్మకొండ విజయం సాధించింది. వికారాబాద్, జనగాం పోటీ పడగా జనగాం విజయం సాధించింది. నిర్మల్, సంగారెడ్డి పోటీ పడగా నిర్మల్ విజయం సాధించింది. ఖమ్మం, మహబూబ్‌నగర్ పోటీ పడగా మహబూబ్‌నగర్ గెలిచింది. వరంగల్, సిద్దిపేట పోటీపడగా సిద్దిపేట గెలిచింది. మహబూబాబాద్, సిరిసిల్ల పోటీ పడగా మహబూబాబాద్ గెలిచింది. మేడ్చల్, పెద్దపల్లి పోటీ పడగా మేడ్చల్ గెలిచింది. మరిన్ని మ్యాచ్‌లు తలపడనున్నారు. పురుషుల విభాగంలో మెదక్, పెద్దపల్లి తలపడగా మెదక్ విజయం సాధించింది. సంగారెడ్డి, నిర్మల్ పోటీపడగా సంగారెడ్డి గెలిచింది. హన్మకొండ, నాగర్‌కర్నూల్ పోటీపడగా నాగర్‌కర్నూల్ విజయం సాధించింది. గద్వాల్ జోగులాంబ, కరీంనగర్ పోటీపడగా గద్వాల్ విజయం సాధించింది. ఆదిలాబాద్, సిద్దిపేట పోటీపడగా ఆదిలాబాద్ విజయం సాధించింది. ఆసిఫాబాద్, వనపర్తి ఇరుజట్లు పోటీపడగా వనపర్తి విజయం సాధించింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల పోటీపడగా మహబూబ్‌నగర్ విజయం సాధించింది. నారాయణపేట, మేడ్చల్‌లు పోటీపడగా మేడ్చల్ విజయం సాధించింది. రంగారెడ్డి, పెద్దపల్లి పోటీపడగా రంగారెడ్డి విజయం సాధించింది. నల్లగొండ, నిర్మల్ పోటీపడగా నల్లగొండ విజయం సాధించింది. సూర్యపేట, నాగర్ కర్నూల్ పోటీపడగా నగర్‌కర్నూల్ విజయం సాధించింది. వికారాబాద్, కరీంనగర్‌లు పోటీపడగా వికారాబాద్ విజయం సాధించింది. ఖమ్మం, సిద్దిపేట పోటీపడగా ఖమ్మం గెలిచింది. రాత్రి 9 గంటల వరకు మరిన్ని లీగ్ మ్యాచ్‌లు ఆడనున్నారు. మొత్తానికి గజ్వేల్ పట్టణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల సందర్భంగా గ్రౌండ్ మొత్తం కిక్కిరిసిపోయింది. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్ మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో రెండవ రోజు ఉత్కంఠభరితంగా కబడ్డీ పోటీలు జరుగుతున్నాయని, 33 జిల్లాల నుండి తరలివచ్చిన జట్లను ఎనిమిది గ్రూపులుగా ఎ, బి, సి, డి, ఈ, ఎఫ్, జి, హెచ్‌లుగా విభజించి ప్రతి గ్రూపులో మొదటి, రెండవ స్థానంలో నిలిచిన 16 జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు వెళ్ళనున్నట్లు తెలిపారు. అలాగే ప్రీ క్వార్టర్ నుండి మొదటి, రెండవ స్థానంలో నిలిచిన ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్‌కు వెళ్ళనున్నట్లు తెలిపారు. ఈ ఎనిమిది జట్ల నుండి మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్‌కు వెళ్తాయని, సెమీ ఫైనల్‌లో తలపడే నాలుగు జట్ల నుంచి రెండు జట్లు ఫైనల్ మ్యాచ్ ఆడనున్నాయన్నారు. చివరి రోజున జరిగే ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్లకు బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు.



కబడ్డీ ఆడుతున్న పురుషుల జట్టు



కబడ్డీ ఆడుతున్న మహిళల జట్లు

## యాసంగి సాగుకు దేవతల చెరువు నీటిని అందించాలి

### -తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన రైతులు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**వెల్దుర్తి, జనవరి12 ప్రభాతవార్త:** యాసంగి సాగుకు పంట పొలాలకు చెరువు నీరు అందించాలని దేవతల చెరువు ఆయకట్టు రైతులు స్థానిక తహశీల్దార్ తులసీరామ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండల కేంద్రమైన వెల్దుర్తిలోని దేవతల చెరువుకు ఆయకట్టు సుమారు 600 ఎకరాలు ఉంటుందని, గత రెండు సంవత్సరాలుగా చెరువు తూము పాడవడంతో చెరువలోని నీరు వృధాగా పోయిందన్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా పడటంతో చెరువు అలుగు పారిందని, ఈసారి యాసంగి పంటలకు 250 ఎకరాల ఆయకట్టుకు రైతులు తైబంధును పెట్టుకున్నారు. తూము ద్వారా వచ్చే నీటిని కొంత మంది రైతులు రానివ్వకుండా చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ తులసీరామ్‌ను కలిసి వారి సమస్యలతో కూడిని వినతిపత్రాన్ని సమర్పించామన్నారు. అలాగే ఇరిగేషన్ ఏఈ కవితకు కవితకు సైతం వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్ ఏఈ కవిత పంట కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో మోటార్లు పెట్టి అక్రమంగా నీటిని తరలిస్తే వారి మోటార్లను సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భరత్‌సింహారెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

## మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



శ్రీ లక్ష్మీనర్సింహ్మాస్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మైనంపల్లి రోహిత్

**గజ్వేల్, జనవరి 12 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయంలో శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి రోహిత్‌కు పూర్ణకుంభంతో వేద పండితుడు స్వాగతం పలికారు. గత ఎన్నికల ముందు మైనంపల్లి రోహిత్ దిలాల్‌పూర్ లక్ష్మీనర్సింహ్మాస్వామిని పూజించగా తాను అనుకున్నది జరిగిందని స్వామివారికి మొక్కు తీర్చుకోవడం కోసం ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

**మైనంపల్లి రోహిత్‌కు ఘన సన్మానం**

మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు కుమారుడు మైనంపల్లి రోహిత్ మొదటిసారి గజ్వేల్ మండలానికి విచ్చేసిన సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని హరిత రెస్టారెంట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఆయన వెంట పిసిసి అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, పట్టణ ఎస్సీ సెల్ నాయకుడు శివులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివారెడ్డి, క్యాసారం బాబా, గుండు లక్ష్మణ్, శ్రావణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, నాగరాజు, అజ్గర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## గృహలక్ష్మీ పథకాన్ని కొనసాగించాలి

### -ఆందోళనకు దిగిన మహిళలు

**సిద్దిపేట రూరల్, జనవరి 12, ప్రభాతవార్త :** బిఅర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గృహ లక్ష్మి పథకం మంజూరు కాపీలు తీసుకొన్న మహిళలు శుక్రవారం నారాయణరావుపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట అందోళనకు దిగారు. పెండింగ్‌లో ఉన్న గృహలక్ష్మి పథకం బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత ఇల్లు కూలగొట్టి అప్పులు తీసుకొచ్చి గృహ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సహకారంతో మంజూరు కాపీలు వచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే దిగిపోవాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం కింద ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



అందోళన చేస్తున్న మహిళలు

## సింగూరు నుంచి నీరు విడుదల



సింగూరు ప్రాజెక్టు డ్యాం దృశ్యం

**పుల్కల్, జనవరి 12, ప్రభాతవార్త:** మండలంలోని సింగూరు ప్రాజెక్టు నుంచి శుక్రవారం నీటిని విడుదల చేశారరు. సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీరా బ్యారేజీకి ఘనపూర్ ఆయకట్ట కోసం నీటిని విడుదల చేసినట్లు సింగూరు ప్రజెక్టు అధికారులు పేర్కొన్నారు.

## రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలి



టిపిసిసి వ్యవహారాల ఇంచార్జి దీపాదాసు మున్షిని సన్మానిస్తున్న దృశ్యం

**సిద్ధిపేట అర్బన్, జనవరి 12, ప్రభాతవార్త :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపికృష్ణ శుక్రవారం హైదారాబాద్‌లో గాంధీభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని దీపాదాస్ మున్షి సూచించినట్లు గోపికృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందేలా చూడాలని సూచించినట్లు తెలిపారు.

## స్పెషల్ సమ్మరి రివిజన్-2024పై రాజకీయ పార్టీలతో సమావేశం

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, జనవరి12 ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికల కసరత్తులో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెసల్ సమ్మరీ రివిజన్-2024 పై రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేట్ చార్ట్‌పై రాజకీయ పార్టీల అబిప్రాయాలను తెలపాలని అన్నారు. జిల్లాలో జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాల పెంపు లాంటి అంశాలపై రాజకీయ పార్టీల నాయకులు అభిప్రాయం పరిగణలోకి తీసుకుంటామన్నారు. స్పెసల్ సమ్మరీ రివిజన్ 2024లో రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాన్ని తెలపాలన్నారు. ఫామ్-6,7 లను పూర్తి చేయాలన్నారు. జనవరి 22 వరకు అభ్యంతరాల క్లైమ్స్ స్వీకరణ, ఫిబ్రవరి 2వ తేదీలోగా క్లైమ్స్ పరిష్కారం, ఫిబ్రవరి 8న తుది జాబితా వెలువడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, ఇశ్రాత్ అలీ, శ్రీనివాస్, నర్సింలు, గౌస్ ఖురేషి, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి చేయూత

**జగదేవ్‌పూర్, జనవరి 12 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన మతీన్ గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం మృతిచెందగా ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి బియ్యం, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు డ్రైవింగ్ నేర్పించి మాతో కలిసి పనిచేసిన మా గురువు మృతిచెందడం బాధాకరమని, వారి కుటుంబానికి తమకు తోచిన సహాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రైవర్లు బరిగె నర్సింలు, బరిగె భాస్కర్, బరిగె ఉప్పలయ్య, మొహినొద్దీన్ తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**సిద్దిపేట రూరల్, జనవరి 12, ప్రభాతవార్త:** సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్ శ్రీ వాణి స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను కళ్లకు కట్టినట్లు సెట్టింగ్ వేసి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, సోది చెప్పారు, రైతు, కుటుంబం, అమ్మమ్మ, నాన్నమ్మ తాతయ్యా, మనుమడు, మనుమరాలు,గంగిరెద్దుల వివిధ వేషధారణలో సాంప్రదాయ పద్ధతిలో విద్యార్థులు ముస్తాబై వచ్చారు. గంగిరెద్దుల అటలు ప్రదర్శించారు. గంగిరెద్దుల అటలు తిలకించిన విద్యార్థు లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.సత్యం మాట్లాడుతూ మరుగుపడుతున్నటువంటి సంప్రదాయాలను, పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. ముగ్గుల పోటీలు గెలుపొందిన మహిళలకు ప్రథమ అనురాధా రూ.2016, ద్వితీయ సునంద రూ.1516, తృతీయ మౌనిక రూ.1016 నగదును అందజేశారు. ముగ్గుల, పతంగి పోటీల్లో విజేతలకు సత్యం చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సెయింట్ విన్సెంట్ పాఠశాలలో ...

**జగదేవ్‌పూర్, జనవరి 12 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలో గల సెయింట్ విన్సెంట్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా ముగ్గులను వేసి బొబ్బమ్మలు ఏర్పాటుచేసి భోగి మంటలు వేయడంతో పాటు వాటి చుట్టూ కేరింతలు కొడుతూ ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానెట్ మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలలో ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని, హిందూ సాంప్రదాయాలను ప్రతిభింబించేలా సంబరాలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కలిగేలా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ అలీనా, సిబ్బంది రమేశ్, కరుణాకర్, రమ్య, కవిత, ఆమని, పద్మ, ఇబ్రహీం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలి



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



వివేకానంద జయంతి వేడుకల్లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎబివిపి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకల దృశ్యం




ఎర్రపప్పుతో వివేకానందుని చిత్రాన్ని చిత్రించిన రామరాజు



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

### సిద్దిపేటలో..

**సిద్దిపేట రూరల్, జనవరి 12, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో 161వ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద అయన విగ్రహానికి టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కో-అర్డినేటర్ దాసరి రాజులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు, కొండలవాడి సతీష్, బడికోల్ రాకేష్ యాదవ్,గ్యార రఘుపతి,పిల్లి మహేష్,సంపత్, అక్బర్, మొగిలి రాకేష్, సంతు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకం**

**బిజెపి జిల్లా అధ్యక్షులు : శ్రీకాంత్‌రెడ్డి**

స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకం అని బిజెపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండ్ల జనార్ధన్, గోనె మార్కండేయులు,శ్రీనివాస్‌రెడ్డి, బందారం కనకరాజు, మోత్కు శ్రీను, మూలం రాజిరెడ్డి, యాదన్‌రావు,కృష్ణ, రమేష్, కిషోర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### మిరుదొడ్డి/కోహేడ మండలంలో..

**మిరుదొడ్డి/కోహేడ, జనవరి 12, ప్రభాతవార్త :** మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సం సందర్భంగా రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్స వం నిర్వహించి స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కోహేడలో..**

కోహేడ మండల కేంద్రంలో బిజెపి మండలశాఖ అధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద 161 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి మండలశాఖ అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం, పార్టీ నాయకులు బండ జగన్ యాదవ్,గుగ్గిళ్ల శ్రీనివాస్, చేపూరి తిరుపతి, ముంజ సాగర్‌గౌడ్,బండ సుమన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### హుస్నాబాద్ పట్టణంలో...

**హుస్నాబాద్,జనవరి12,ప్రభాతవార్త :** అందరివాడు స్వామి వివేకానంద అని టిపిసిసి సభ్యులు కేడం లింగమూర్తి అన్నారు.శుక్రవారం పట్టణంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ రవిందర్,కౌన్సిలర్లు భూక్య సరోజన,వల్లపు రాజు,పున్న లావణ్యసది,బిసి కమిటి మెంబర్ ముస్సేన్,నాయకులు బంక చందు, బాలయ్య,బిక్యా నాయక్,శ్రీకాంత్‌రెడ్డి, షబ్బీర్, నాయకులు వెన్న రాజు,బూరుగు కిష్టస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ చౌరస్తాలో

స్వామి వివేకానంద వ్యక్తి కాదు ఒక శక్తి అని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల ఆదిత్య అన్నారు.శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వివేకానంద 161వ జయంతి వేడుకలను పట్టణశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘం నగర కార్యదర్శి కంసాని రాకేష్,ఉపాధ్యక్షులు చరణ్,రాకేష్, రాజు, సందీప్, నాయకులు రాహుల్,సంపత్, ప్రభాస్,విగ్నేష్, శిరీష,సాయి వర్శినితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### గజ్వేల్‌లో...

**గజ్వేల్ టౌన్, జనవరి 12 (ప్రభాతవార్త):** స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకొని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు వినూత్న ఆలోచనతో ఎర్రపప్పుతో వివేకానందుని చిత్రాన్ని చిత్రించి శుక్రవారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ వివేకానందుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని తెలిపారు.

### కొల్చారం మండలంలో..

**కొల్చారం, జనవరి12 ప్రభాతవార్త:** లేవండి మేల్కొనండీ.. గమ్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకండి.. బలమే జీవనం.. బలహీనతే మరణం అని కొల్చారం ఎస్ఐ మహమ్మద్‌గౌడ్, సర్పంచి కరెంట్ ఉమా రాజాగౌడ్, ఎంపీటీసీ పాల్వంచ అరుణ కృష్ణాగౌడ్, సంఘమిత్ర యువజన సంఘం అధ్యక్షులు కావేశ్వరచారిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 1161వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర యువజన సఘం అధ్యక్షులు కావేశ్వరచారి, ఉపాధ్యక్షులు తిమ్మన్నగారి అనిల్, కోశాధికారి వర్కల చంద్రశేఖర్, సభ్యులు సాతెల్లి రాజు, తమ్మలి సంతోష్ కుమార్, ఆశన్నగారి ప్రదీన్, కమ్మరి హరీష్, చౌరిగౌరి భాస్కర్, సాయికుమార్, చక్రధర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, సత్యనారాయణ, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి : కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం




విలేకరులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం

**సిద్దిపేట రూరల్, జనవరి 12, ప్రభాతవార్త :** అక్రమంగా భూ కబ్జాకు పాల్పడుతున్న వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం కోరారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కొంత మంది తానే కొంత స్థలాన్ని కబ్జా చేశానని తనపై వస్తున్న అరోపణలలో ఎలాంటి నిజం లేదన్నారు. 1640 సర్వే నంబరులో రబ్బా 2 ఎకరాల 11 గుంటలు ఉండగా అందులో తానూ 1 ఎకరం 5 గుంటలు మాత్రమే పట్టేదారు నజిరోద్దిన్ నుంచి కొనుగోలు చేశానని తెలిపారు. ఎన్నో యేండ్లుగా పట్టాదారులుగా ఉంటున్న వారి వద్ద నుంచి తాను నేరుగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. 1640 సర్వేనంబర్‌లో ఒక ఎకరం 5 గుంటల భూమి కొనుగోలు నిమిత్తం పట్టాదారు నజీరుద్దీన్‌తో 2016లో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తి మరణించడంతో 2023లో నజీరుద్దీన్ కొడుకు నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. అ స్థలంపై ఎలాంటి హక్కులు లేకుండా పత్రాలు సృష్టించిన కొంత మంది రియల్ వ్యాపారులు ఈ స్థలాన్ని ప్లాట్లుగా చేసే అమాయకులకు అమ్ముకున్నారని అరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. తాను ఎవరికి అన్యాయం చేయనని నాకు ఎవరు అన్యాయం చేసిన ఉరుకోనని హెచ్చరించారు. అక్రమ పత్రాలతో సదరు భూమిని అమ్మిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవడంతో పాటు సర్వే నిర్వహించి తనకు న్యాయం చేయాలని కోరారు. తనపై నిరాధారణ అరోపణలు చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు. తాను స్థలాన్ని కబ్జా చేయలేదని..స్వంత డబ్బులతో కొనుగోలు చేశానని వివరించారు.

## రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి



కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి12 ప్రభాతవార్త:** జిల్లాలో రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా బాధ్యులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని యాదవ, కురుమ, గొర్రెల కాపరులం తెలంగాణ ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ గొర్రెల పంపిణీ కార్యక్రమం ఎస్ఆర్‌డీపీ 2017వ సంవత్సరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి మొదటి విడతను మన జిల్లాలో విజయవంతం చేసుకోవడం జరిగిందన్నారు. 2019వ సంవత్సరంలో రెండవ విడతను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదలు పెట్టుకోవడం జరిగిందన్నారు. గత కొన్ని నెలల క్రితం గొర్రెల పంపిణీ కార్యక్రమం డీడీలు కట్టామని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు మెదక్ జిల్లాలో రెండవ విడత డీడీలు కట్టిన లబ్ధిదారులకు గొర్రెల పంపిణి/నగదు బదిలీ కార్యక్రమం చేపట్టకపోవడం విచారకరమన్నారు. తేదీ 26-01-2024 నాటికి తెలంగాణ ప్రభుత్వం నుండి గొర్రెల పంపిణీ కార్యక్రమ విధివిధానాలు రానియెడల తెలంగాణ రాష్ట్రంలో గొర్రెల కాపరుల పక్షాన ప్రతి జిల్లా కేంద్రంలో ఉద్యమాన్ని చేపడతామని వారు అన్నారు.

## కుకునూర్‌పల్లిలో హెచ్ఐవిపై అవగాహన



హెచ్ఐవిపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**గజ్వేల్ టౌన్, జనవరి 12 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ డిఎంహెచ్ఓ మరియు డిపిఎం వారి ఆధ్వర్యంలో శ్రీ సత్య జానపద కళా సమితి వారు శుక్రవారం కుకునూర్‌పల్లి గ్రామంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి ఎయిడ్స్‌పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ జ్యోతి, స్టాఫ్ అవుట్ రీచ్ వర్కర్స్ విజయ, పూర్ణిమ, నవనీత, లక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సో నిందితునికి సంవత్సరం జైలుశిక్ష..జరిమాన

**హుస్నాబాద్,జనవరి12,ప్రభాతవార్త :** హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 సంవత్సరాల బాలికను ప్రేమిస్తున్నాని తనను పెళ్లి చేసుకోవాలని మానసికంగా శారీరకంగా వేదించిన పోతారం గ్రామానికి చెందిన బోయిని వంశీపై బాదిత బాలిక 2019లో ఎస్ఐ దాస సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసిన ఎస్ఐ దాస సుధాకర్ పరోశోదన చేసి నేరస్తున్ని జుడీషియల్ రిమాండ్‌కు పంపించారు.తదుపరి ఎస్ఐ సజ్జనపు శ్రీధర్ కేసు పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేయగా నేరస్థునికి శుక్రవారం రోజున ఒక సంవత్సరం చైలు శిక్షతో పాటు 1100ల రూపాయల జరిమాన విధించినట్లు హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ తెలిపారు.ఈకేసులో తన వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రిసిక్యూటర్ వెంకట్ లింగం,ఎస్ఐ తోట మహేష్,హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్,రాజమల్లు, కానిస్టేబుల్ శివప్రసాద్‌లను పోలీస్ కమిషనర్ బి అనురాధ అభినందించారు.

## బాధిత కుటంబానికి ఆర్థిక సహాయం

**వెల్దుర్తి, జనవరి12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మానెపల్లి గ్రామంలో కమ్మరి వీరమణి, రామాయపల్లిలో రామాగౌడ్, కుకునూర్‌లో యశ్వంత్ కుటుంబాల సభ్యులను శుక్రవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నరేందర్‌రెడ్డి, మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా స్వేరోస్ నెట్‌వర్క్ నూతన కమిటీ ఎన్నిక

**సిద్దిపేట రూరల్, జనవరి 12, ప్రభాతవార్త :** స్వేరోస్ నెట్‌వర్క్ అనుబంధ సంఘాలుగా ఉండి గత 14 యేండ్లుగా వివిధ శాఖలుగా ఉన్నటువంటి నెట్‌వర్క్ అన్ని శాఖలను ఏకం చేస్తూ ఒకే స్వేరోస్ నెట్‌వర్క్‌గా ఏర్పాటు చేయాలని రాష్ట కమిటీ అదేశాల మేరకు స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాతంగి మారుతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్ర సురేష్‌కుమార్, సీనియర్ నాయకులు మెట్ల శంకర్, గోషికికుమార్‌ల అధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బెజ్జంకి మండలానికి చెందిన ఉప్పులేటీ బాబు, మర్కుక్ మండలానికి చెందిన చిన్ని క్రిష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బోజు నరేష్, ఎడ్ల ప్రవీణ్, గాజుల నందం, కోశాధికారిగా సుంచు సుధాకర్, అధికార ప్రతినిధిగా కోదూరు స్వామి, సంయుక్త కార్యదర్శులుగా బండి తిరుపతి, గడ్డం ప్రేమ్‌రాజ్, బుట్టి భారత్‌తేజ, కార్యనిర్వాక కార్యదర్శులుగా మాంకాలి నగేష్, స్వామి, భుక్య హేమురాథోడ్, కార్యవర్గ సభ్యులుగా బోనగిరి బాల తిరుపతి, ఎర్రబాగు భానులను నియమించారు. కార్యక్రమంలో సంజీవ్, ఉప్పులేటీ శ్రీనివాస్, బెజ్జంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందూర్ కాలేజీలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**సిద్దిపేట అర్బన్, జనవరి 12, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల సమీపంలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంబరాలలో భాగంగా అటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి భోగి మంటలను పెట్టారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పతంగులను ఎగరవేశారు. స్టాఫ్ అంట్ స్టూడెంట్స్ ర్యాంప్ వాక్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥ వి.పి.రాజు మాట్లాడుతూ ఇందూరు కళాశాలలో ప్రతి యేటా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈసీఈహెచ్ ఓడి మల్లేశం, సివిల్ హెచ్‌వోడి శ్రీనివాస్, ఈఈఈహెచ్ఓడి ఎల్ఎన్‌రావు, హెచ్ఓడి మెకానికల్ పోచయ్య, రహీం సుల్తానా, రఘు, హిమబిందు, భాగ్య, స్వప్న, త్రివేణి, మానస, అపర్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో**

సిద్దిపేట అర్బన్ మండలం గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి విద్యార్థులకు ముందస్త సంక్రాంతి సంబరాలను నిర్వహించి ముగ్గుల పోటీలతో పాటు పిండివంటలను చేసి పెట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయం

**-హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న**



అనాద పిల్లల పుట్టిన రోజు నిర్వహిస్తున్న బాల వికాససంస్థ ప్రతినిధులు

**హుస్నాబాద్,జనవరి12,ప్రభాతవార్త :** బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు.శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో సంస్థ ఆధ్వర్యంలో అనాద పిల్లల పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అథిధులుగా మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేడం లింగమూర్తి హాజరయ్యారు.ఈ సందర్భంగా పిల్లలతో కేక్ కట్ చేయించి మాట్లాడుతూ తల్లితండ్రులు లేని పిల్లలను హక్కున చేర్చుకుని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు.అనాదపిల్లలైన తమకు మహిళా సభ్యులు అండగా ఉంటూ తమ తల్లిలా చూసుకుంటున్నారని తెలపడంతో హాజరైన సభ్యులంతా కన్నీటి పర్యంతమయ్యారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిత్తారి రవిందర్,నాయకులు వెన్న రాజు,బాల వికాస సంస్థ ప్రతినిధులు జ్యోతి, సరళ,అన్నమేరీ,నిర్మళ,శ్రీమతి,సుజాతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

**హుస్నాబాద్,జనవరి12,ప్రభాతవార్త** ఆదర్శ పాఠశాల(మోడల్‌స్కూల్)లో 6వ తరగతితో పాటు పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు.ఆరవ తరగతిలో 100 సీట్లతో పాటు పై తరగతుల్లో ఖాళీ సీట్లకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకునేందుకు నేటి నుండి ఏప్రిల్ 1వరకు అవకాశం ఉందని 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులను తీసుకోవడం జరుగుతుందన్నారు.దరఖాస్తు మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు.

**-పాఠశాలలో అంకురం బిజినెస్ స్టాల్ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్...**

పట్టణంలోని ఆదర్శ పాఠశాల(మోడల్‌స్కూల్)లో శుక్రవారం హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అంకురం అనే బిజినెస్ వ్యవస్థాపక కార్యక్రమం రూపొందించారు.ఇందులో స్టైలీష్ లేడీస్ ఎంపోరియంతో పాటు జనరల్‌స్టోర్ ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,కౌన్సిలర్ కొంకటి నళినిరవి,పేరెంట్స్ కమిటి సభ్యులు దేవేందర్ నాయక్‌తో పాటు పాఠశాల అధ్యాపక బృధం పాల్గొన్నారు.

## టీఎస్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ




టీఎస్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి12 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను టీఎస్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఫ్ నాయకులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు అభినందనలు తెలిపారు. టీఎస్‌యూటీఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, అదేవిధంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, ఉపాధ్యక్షులు కవిత, అజయ్ కుమార్, కోశాధికారి రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు సుధాకర్, భీమ్లా నాయక్, పోచయ్య, యేసయ్య, భూషణం, శీతల్‌సింగ్, గణేష్, ప్రభాకర్, బాబు, ఫయాజుద్దీన్, షాకీరన అలీ, మణిరామ్ పాల్గొన్నారు.



బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను కలిసిన డిసిసిబి మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి

## బండి సంజయ్‌ను కలిసిన జైపాల్‌రెడ్డి

**జహీరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌ను శుక్రవారం డిసిసిబి మాజీ చైర్మన్, బిజెపి నేత మొగలిగుండ్ల జైపల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం గురించి బండి సంజయ్ జైపాల్‌రెడ్డితో ఆరాతీసినట్లు సమాచారం. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానంనుంచి కాషాయ జండా ఎగరడం తథ్యమని బండి సంజయ్ ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

### రామచంద్రాపురంలో మహేష్‌బాబు అభిమానుల సందడి

**రామచంద్రాపురం, జనవరి 12, ప్రభాతవార్త:** సూపర్‌స్టార్ మహేష్ బాబు నటించిన గుంటూరు కారం సినిమా శక్రవరం రామచంద్రాపురం లోని ఎస్‌విసి సంగీత్ థియోటర్‌లో విడుదల కావడంతో మహేష్‌బాబు అభిమానుల సందడి నెలకొంది. సినిమా థియోటర్ ఆవరణలో మహేష్ బాబు కటవుట్‌లను ఏర్పాటు చేసి పూలమాలలు, రంగురంగు విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు డప్పు చప్పుళ్ల మద్య పటాకులు కాలుస్తూ, మిఠాయిలు తినిపించుకుంటూ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోహెల్, వేణుగౌడ్, థియోటర్ మేనేజర్ దుర్గ ప్రసాద్‌లు హాజరై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి నోటిని తీపి చేసుకున్నారు. అతిథులకు అభిమానులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమలో అభిమానులు హరీష్, వివేక్, మహేష్, అశోక్, శ్రీకాంత్, గణేష్, ప్రశాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**నారాయణఖేడ్, జనవరి 12 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ డివిజన్ కేంద్రంలో మాజీ జిల్లా అధ్యక్షుల కోటారి నర్సింలు ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ లో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా కోటారి నర్సింలు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఆటలు, పోటీపరీక్షలు నిర్వహిస్తుందన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అధికారుల చేతుల మీదుగా అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కింది దోడ్డి సతీష్, నాయకులు రమేష్, పవన్, సంతోష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ తరగతులు

**సంగారెడ్డి టౌన్, జనవరి 12, ప్రభాతవార్త:** సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ (విద్యానగర్) పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసతరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యక్తిత్వ వికాస నిపుణులు యాంకర్ మహేష్ రాజు హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు అందచేశారు. మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయుల్లో సృజనాత్మక సామర్థ్యాలను సరికొత్త నైపు ణ్యాలను పెంపొందించుకోవడానికి, విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొదించేందుకు సరికొత్త విధానాలను ఉపాధ్యాయులకు అందించేందుకు అవగాహన సదస్సు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల చైర్మన్ ఆంథోనిరెడ్డి, కరస్పాండెంట్ రవి కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మహేందర్, సెయింట్ గ్సేవియర్స్ ప్రిన్సిపాల్ మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### హరీష్‌రావును కలిసిన మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్మన్ నయిమొద్దీన్



నయిమొద్దీన్‌ను శాలువాతో సన్మానిస్తున్న హరీష్‌రావు, సునీతారెడ్డి

**నర్సాపూర్, జనవరి 12, ప్రభాతవార్త:** మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి నహిమొద్దీన్‌ను ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీస్‌రావు నూతనంగా నర్సాపూర్ మున్సిఫల్ ఇంచార్జీ చైర్మన్‌గా ఎన్నికైన ఎండి నహిమొద్దీన్ కు అభినందనలు తెలిపి పుష్ప గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ మేరకు నర్సాపూర్ మున్సిఫల్ అభివృద్ధి తో పాటు నియోజకవర్గంలో బిఆర్ఎస్‌పార్టీని భలోపేతం చేయాలన్నారు. అంతేగాక రానున్న ఎంపి ఎన్నికల్లో మెదక్ ఎంపి స్థానాన్ని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు సూచించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మున్సిఫల్ ఇంచార్జీ చైర్మన్ ఎండి నహిమొద్దీన్ లతో పాటు మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, నాయకులు కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్ తదితరులున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ఎమ్మెల్యేసమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలు

**నారాయణఖేడ్, జనవరి 12 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఆరుగ్యారంటీలకు ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు గౌడ్‌గామ్ గ్రామానికి చెందిన భారస, బిజేపీ కార్యకర్తలు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే స్వగృహంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే డాక్టరు సంజీవరెడ్డి పార్టీ కండువలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాజీ సర్పంచ్ బాబురావు, శివాజీరావు, రమేష్‌రావు, గురునాథ్, పండరి నాథ్‌రావు, విఠల్‌రావు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో సిర్గాపూర్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మనిష్‌పాటిల్, యాదవరెడ్డి, మధుసూదన్, రాజురెడ్డి,రాజప్ప, ప్రకాష్, గణపతిరావు, రవి, మారుతి రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయి

**యాచారం, జనవరి 12, ప్రభాతవార్త :** క్రీడాలతో శారీరదారుఢ్యం, మానసికోల్లాసాన్ని పెంచుకోవచ్చుని ఎస్ఐ వెంకట్‌నారాయణ,బిఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ని ఎస్ఐ వెంకట్ నారాయణ,ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్రీడాలతో మానసిక ఉల్లాసం శరీరదారుఢ్యం పెంపొందించుకోవచ్చని అన్నారు. జపాల, యాదగిరి ,తెలుగమల రవి,భూపతి,రామకృష్ణ,సామ మల్లేష్,నూకం కృష్ణ, కొండాపురం కృష్ణ, పగిల వెంకటేష్,ఆర్గనైజర్స్, కాశినాదం, హెచ్ రామకృష్ణ, పంది భరత్, కానిస్టేబుల్ గోరటి సత్యనారాయణపాల్గొన్నారు.



రామాయంపేటలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వివేకానందునికి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు




వివేకానంద విద్యాలయంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ రంజిత్‌కుమార్



ఖేడ్‌లో ఘనంగా వివేకానందుని జయంతి వేడుకలు



నర్సాపూర్‌లో వివేకానందకు నివాళులర్పించిన బిజెపి నాయకులు



నర్సాపూర్‌లో వివేకానందకు నివాళులర్పించిన ఉత్సవ సమితీ సభ్యులు

# గ్రామ గ్రామాన స్వామి వివేకానందకు ఘన నివాళి

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 12,ప్రభాతవార్త**

రామాయంపేట మున్సిపాలిటీలో స్వామి వివేకానంద 161వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వివేకానంద యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో సిద్దిపేట క్రాస్ రోడ్డులోని వివేకానంద సర్కిల్‌లో ఉన్న వివేకానంద విగ్రహానికి మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం వివేకానంద విద్యాలయం విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.వివేకానందుని వేషాధారణలో ఉన్న చిన్నారులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, పాక్స్ చైర్మెన్ బాదె చంద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, బిజెపి ఓబీసీ సెల్ నాయకుడు నవాత్ రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, కౌన్సిలర్ బొర్ర అనిల్ కుమార్, నాయకులు చింతల యాదగిరి, సరాఫ్ శ్యామ్, వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు దోమకొండ చిన్న శ్రీనివాస్, సభ్యులు మర్కు నగేష్, వెన్నెల కిరణ్, దోమకొండ పెద్ద శ్రీనివాస్, మన్నె శ్రీనివాస్, మర్కు కిరణ్, మెక్కొండ వికాస్, మెక్కొండ వంశీ, రాజాకిషన్, దోమకొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో...**

**రామాయంపేట, జనవరి 12, ప్రభాతవార్త :** జాతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, రాష్ట్రశాఖల ఆదేశానుసారం వికసిత్ యువ, వికసిత్ భారత్ అనే విషయంలో దేశ వ్యాప్తంగా వివేకానందుని జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రామాయంపేటలోని సిద్దిపేట్ రోడ్ కూడలిలో గల వివేకానందుని విగ్రహానికిశాఖ ఆధ్వర్యంలో సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ మెదక్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వివేకానందుడు యువశక్తి అని, స్ఫూర్తి ప్రధాతయని, భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సింగం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రెడ్‌క్రాస్ శాఖలు వివేకానందుని జయంతిని జరుపుకుంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు జనగామ ఆర్డీవో సింగం శ్రీనివాస్‌రావు, మెదక్ రెడ్‌క్రాస్ శాఖ ఉపాధ్యక్షులు పి.లక్ష్మణ్‌యాదవ్,కార్యదర్శి టి.సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి డి.జి.శ్రీనివాస్‌శర్మ, ఎంసీ మెంబర్లు దేమె యాదగిరి, వి.దామోదర్‌రావు, సతీష్‌రావు, దోమకొండ శ్రీనివాస్, హనుమకొండ శ్రీకాంత్‌శర్మ, శ్రీశైలం, దోమ మరియమ్మ, తాడి డేవిడ్, సాంగని యాదగిరి, ఎస్.కె. హైమద్ పాల్గొని ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.

**వివేకానంద విద్యాలయంలో...**

**రామాయంపేట, జనవరి 12, ప్రభాతవార్త :** రామాయంపేటలోని వివేకానంద విద్యాలయంలో వివేకానంద 161వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్‌కుమార్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వివేకానంద చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఎస్ఐ మాట్లాడుతూ వివేకానందుని సూచనలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు.ప్రిన్సిపాల్ రామ్‌కుమార్ మాట్లాడుతూ వివేకానందుని జయంతిని భారతప్రభుత్వం యువజన ఉత్సవంగా ప్రకటించడం భారతీయులకు గర్వకారణం అన్నారు.

అనంతరం విద్యార్థుల ర్యాలీ మెదక్ చౌరస్తా మీదుగా వివేకానంద విగ్రహం వద్దకు చేరుకొని, పురప్రముఖుల సమక్షంలో పూలమాలలు సమర్పించారు. విగ్రహం ముందు విద్యార్థులు ప్రదర్శించిన సూర్య నమ స్కారాలు, పిరమిడ్ విన్యాసాలు ప్రజలను ఆకట్టుకు న్నాయి. వారిని వివేకానంద యూత్‌క్లబ్ వారు అభినం దించి, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ ఎం.రవి, ఉపాధ్యాయులు, రాంప్రసాద్, రవికాంత్, ఏగొండ, రవి, నరేందర్, శేఖర్, భరత్ తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**

**నారాయణఖేడ్, జనవరి 12 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో స్వామి వివేకానందుని 161 జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని మున్సిపల్ ఆవరణలోగల వివేకానందుని విగ్రహానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆనంద్ స్వరూప్‌శెట్కార్, దారం శంకర్‌సేట్, వివేకానంద, నర్సింలు, మజీద్, డిగంబర్ రావు, నారాయణ ఆసుపత్రి డాక్టరు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాహేర్‌అలీ, ముంతాజ్, వివేకానంద యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, జనవరి 12, ప్రభాతవార్త:** యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో పయనించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్ అన్నారు. శుక్రవారం స్వామివివేకానంద 161 జయంతి వేడుకలను నర్సాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ బిజెపి నాయకులు కలిసి ఎంపిడివో కార్యాలయంలోని వివేకానంద విగ్రహానికి మురళీ యాదవ్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కౌన్సిలర్ గోద రాజేందర్, కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ సంగసాని సురేశ్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్,ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, మాజీ సర్పంచ్ హన్మంతు వెంకటరమణారావు, బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేశ్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,పట్టణ ఉపాధ్యక్షులు రాజు,పట్టణ ప్రధాన కార్యదర్శి బాలరాజు,శక్తి కేంద్రం ఇంచార్జి బోర్‌వెల్ రాంరెడ్డి,పూనా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**వివేకానంద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో...**

**నర్సాపూర్, జనవరి 12, ప్రభాతవార్త:** వివేకానంద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానందజయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మెదక్ జిల్లా కార్యావాహ ఓంకార్ అధ్వర్యంలో నిర్వహించగా ఎంపిడిఓ కార్యాలయంలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళుర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి అశోక్, అనిల్, వేణు, సురేశ్, సత్యం, శ్రీకాంత్, సాయి, బాబురావు, శ్రీనివాస్, శివకృష్ణ, శశి, బిజెపి నాయకులు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, నాయకులు బాల్‌రాజు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ఆయుష్ జంపల్

## చివరి దశకు చేరుకున్న కిజర్ యాపై క్రికెట్ పోటీలు

**-మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా అయుష్ జంపల్**

**జహీరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో కొనసాగుతున్న కిజర్ యాపై గోల్డ్ కప్ క్రికెట్ టౌర్నమెంట్ పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. ఈనెల 7వ తేదీ నుంచి కొనసాగుతున్న టౌర్నమెంట్ శుక్రవారం 6వ రోజు రెండు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. శుక్రవారం జరిగిన మూడు మ్యాచ్‌లలో అచ్చంపేట గ్రీన్ జట్టు క్వాటర్ ఫైనల్‌లో విజయం సాధించి సెమి ఫైనల్‌కు చేరుకుంది. మరో క్వారటర్ ఫైనల్ మ్యాచ్‌లో జెబి శేఖపూర్ జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం టౌర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. టోర్నమెంట్ విజేత జట్టుకు 5లక్షల 55వేల రూపాయల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు 3 లక్షల 33వేల రూపాయలతో పాటు ట్రోఫిని అందించనున్నారు.

### ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**వికారాబాద్,జనవరి 12, ప్రభాతవార్త:** పూడూరు మండలం ఆదర్శ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశాలకు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించ నున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పి.శ్రీదేవి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని తెలి పారు. ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 నుంచి 10వ తరగతులకు సంబంధించి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్లో డైన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తమ పాఠశాలలో కార్పోరేట్‌కు ధీటుగా, నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యా బోధన ఉంటుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి క్రీడల్లో, ఇతర యాక్టివిటీలో తర్ఫీదునివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుపేద, మద్యతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## పేదలకు అండగా కమ్యూనిస్టు పార్టీ

**సిపిఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి**

**చేవెళ్ల, జనవరి 12, ప్రభాతవార్త** పేద ప్రజలకు అండగా నిరంతరం భారత కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని చేవెళ్ల మండల సిపిఐ కార్యదర్శి సత్తిరెడ్డి అన్నారు. శుక్రవారం మల్లారెడ్డి గూడ గేటు సమీపంలో సిపిఐ పార్టీ జెండాను ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి పాల్గొని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల మండల సిపిఐ కార్యదర్శి సత్తిరెడ్డి మాట్లాడు తూ సిపిఐ ఏర్పాటు చేసి 98 సంవత్సరాలు పూర్తవుతుందని, పేద ప్రజలకు కష్టం వస్తే ముందుండి పోరాటం చేస్తుందన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా పేదల కోసమే పోరాటం చేస్తున్నా మన్నారు.రైతుల కోసం, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెం కటరెడ్డి, సహాయ కార్యదర్శి వెంకటయ్య, సభ్యులు సత్తయ్య, విఠలయ్య, నరసింహులు, అంజయ్య, శ్రీనివాస్, ఏఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మహిళ సంఘం అధ్యక్షురాలు వడ్ల మం జుల, మండల ఏఐటియుసి అధ్యక్షుడు శివక్రిష్ణాచారి, అనంద్, శ్రీశైలం, లలిత, యాదమ్మ, వెంకటమ్మ, సుగుణమ్మ, స్వరూప, ప్రియ, బాలమణి తదితరులు పాల్గోన్నారు.



వివేకానందునికి పూలమాల వేస్తున్న ఏసిపి రమేష్, దేశబోయిని నర్సింలు

## స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడు : ఏసిపి

**గజ్వేల్, జనవరి 12 (ప్రభాతవార్త):** స్వామి వివేకానందుడు ఆదర్శప్రాయుడని గజ్వేల్ డివిజన్ ఏసిపి మడత రమేష్, బాలల సంక్షేమ సమితి సభ్యుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింలులు పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని యువజన సంఘాల ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏసిపి రమేష్ మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి యువతకు ధీరత్వాన్ని నూరిపోసిన వివేకానందుని జన్మదినం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. యువత చిన్న చిన్న విషయాలకు మనస్థాపం చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అలాంటి సంఘటనలు జరగడం మంచిదికాదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ డిగ్రీ కళాశాల లెక్చరర్, లెఫ్టినెంట్ భవాని, ఎండి.సలీం, వంశీకృష్ణ, అమరవాది శ్రీవాత్సవ్, సంతోష్, రాళ్ళబండి ప్రవీణ్, నర్సింహ్మాచారి, ప్రకాష్, సురేష్, నాగరాజు, ప్రశాంత్, నర్సింలు, శేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### మామిడిపల్లిలో అయోధ్య అక్షింతల శోభాయాత్ర

**నందిగామ,జనవరి 12, ప్రభాతవార్త :** నందిగామ మండలంలో మొదల్లగూడ మంచన్ పాడు గ్రామాలలో శుక్రవారం ఆయోధ్య శ్రీరాము డి అక్షింతలతో అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి మండలాల మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డి హాజరయ్యారు. మామిడికుంటలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం అయోధ్య అక్షిం తల శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామాలలో తిరిగి అయోధ్య అక్షింతలను ఇంటింటికి తిరిగి అక్షింతలను పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో మొదలగూడ సర్పంచ్ ఎన్ఉమా ప్రవీన్‌రెడ్డి, మామిడిపల్లి ఎంపిటిసి కాట్న మాధవి రవీందర్, మామిడిపల్లి సర్పం చ్ కవితాశ్రీను ఉపసర్పంచ్ హనుమంత్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సత్యానారాయణ, మొదలగూడ ఉపసర్పంచ్ సోఫియా షఫీ, వార్డు సభ్యులు శ్రీను అబ్బాస్ రాజు శ్రీరామ్ సునీత భాగ్యమ్మ గ్రామపెద్ద లు దామోదర్‌రెడ్డి, ఏ రామచంద్రయ్య కోరే రాజు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ హితం కోసం యువత పాటుపడాలి

**ఆమనగల్లు, జనవరి12, ప్రభాతవార్త:** దేశ భవిష్యత్తు యువకులపైనే ఆధారపడి ఉంటుందని, సమాజాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పలువురులు అన్నారు. సన్మార్గంలో ముందుకు సాగుతూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. జాతీయ యువజన దినోత్సవం పురష్కరించుకుని ఆమనగల్లు ఏబీవీపీశాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆమనగల్లు పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేశారు. శిబిరానికి మంచి స్పందన వచ్చింది. 100మందికి పైగా శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, కమీషనర్ శ్యాంసుందర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై బల్‌రాంనాయక్, గ్రేటర్ హైదరాబాద్ ఏబివిపి ప్రముఖ్ రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ కందడి శ్రీరామ్, కార్యవర్గ సభ్యులు గోరటి భరత్, పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. నిపుణుల పర్యవేక్షణలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు శిబిరాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పురుగుల శివ, రేవంత్, లండం మల్లేశ్, కొత్ర సురేష్, మొక్తాల సాయి, మల్లేశ్, అంజీ, సురేష్, శివాచారి, సుమన్‌నాయక్, తరుణ్‌నా యక్, బద్రునాయక్, శ్రీకాంత్‌సింగ్, గోరటి నర్సింహ్మా, బైకని శ్రీశైలంయాదవ్, మొక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేశ్, ముక్కెరి ప్రవీణ్, వరికుప్పల శ్రీను, వద్దె రాజు, విజయ్ తదితరులు ఉన్నారు.



రైతులకు పంటలపై అవగాహన కల్పించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

### షెడ్యూల్ కులాల రైతులకు జీవన ఎరువుల పంపిణీ

**నర్సాపూర్, జనవరి 12, ప్రభాతవార్త:** డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో షెడ్యూల్ కులాల రైతులకు జీవన ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.షెడ్యూల్ కులాల రైతులకు బాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా(పిఎస్‌బి) గ్రామంలోని 40 మంది రైతులకు 2 లీటర్ల చొప్పున పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ఇంచార్జ్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు అధికంగా రసాయినిక ఎరువులు వాడుతూ సేంద్రీయ ఎరువుల వాడక పోవడం వల్ల నేలలోని బాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా లేక పోవడం వల్ల బాస్వరం ఎరువులు మొక్క తీసుకోలేని స్థితిలో ఉన్నాయన్నారు. దీనివల్ల ఎరువులు భూమిలో పేరుకుపోయి చౌడు నేలలుగా గట్టిగా తయారవుతున్నాయన్నారు. దీనికితోడు మొక్క పెరుగుదల మరియు దిగుబడులు తగ్గుతాయన్నారు. రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువుల వాడటంవల్ల పెట్టుబడి ఖర్చులు అధికమవుతాయన్నారు. ఈ భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియాను 500 మిల్లీ లీటర్లు తీసుకొని తగినంత నీటిలో నారుమడిలో కలుపుకొని నాటు వేసేముందు పీకిన నారువేర్లను బ్యాక్టీరియాను కలిపిన నీటిలో 20 నుండి 30 నిమిషాలు ఉంచి ఆతర్వాత నాటు వేసుకోవాలని సూచించారు.లేదా ఒక లీటర్ బ్యాక్టీరియా ని 100 నుండి 200 కిలోల మాగిన పశువుల పేడలో కలుపుకొని ఎకరం పొలంలో వెదజల్లు కోవచ్చని తెలిపారు.అనంతరం కీటక శాస్త్రవేత రవికుమార్ మాట్లాడుతూవరి పంటల్లో చీడపీడలు రాకుండాతీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.యాంత్రికరణ శాస్త్ర వేత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూడ్రోన్ ద్వార వరి పంటలో స్ప్రే చేసే పద్దతి దాని ఉపయోగాలను క్లుప్తంగా వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోచమ్మ లక్ష్మయ్య, మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటి విద్యార్థినులు నీతిషా, సంజన, ప్రేసి,దేవిశ్రీ, బ్రింద,అనుష్క, ద్రిష్ట, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగులకు బదిలీలు సహజమే: మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జనవరి 12 ప్రభాతవార్త:** కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. గతంలో పనిచేసిన సంగారెడ్డి జిల్లా కలెక్టరు డాక్టరు శరత్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.శుక్రవారం సంగారెడ్డిలో కలెక్టరు ఆడిటోరియంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడ్కోలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరు శరత్‌కు కలిసి పూలబోకే అందజేశారు ఆయన నారాయణ ఖేడ్ నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. బదిలీపై వెళ్లడంతో మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అబినందనలు తెలిపారు.



కలెక్టరు డాక్టరు శరత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

